శ్రీ హరి

వసుదేవసుతం(న్) దేవం(జ్), కంసచాణూరమర్దనం
దేవకీ పరమానందం(జ్), కృష్ణం(మ్) వందే జగద్గురుం

॥ गीता पढ़ें, पढ़ायें, जीवन में लायें ॥

# శ్రీమద్భగవద్గీత వివేచన సారాంశము

## అధ్యాయము 13: క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము

2/3 (శ్లోకము 12-19), శనివారం, 16 సెప్టెంబర్ 2023

**వివేచకులు: గీతా విశారద డా. ఆశూ గోయెల్ గారు**

YouTube లింక్: https://youtu.be/IzuUlJ4P23c

# జ్ఞానము- జ్ఞేయము- జ్ఞాన గమ్యము

సాంప్రదాయాను గుణముగా శ్రీకృష్ణ ప్రార్థన ,సరస్వతీ ప్రార్థన మరియు దీప ప్రజ్వలనముతో వివేచనా కార్యక్రమము ప్రారంభమైనది. డాక్టర్ శ్రీ ఆశు గోయల్ గారు ప్రార్థన చేసి, గురు చరణకమలములకు వందనమొనర్చి తమ వివేచనను మొదలుపెట్టారు. మనమందరము ఎంతో భాగ్యవంతులము. మనం చేసిన పుణ్యఫలం వలననో,పూర్వజన్మ సుకృతము వలననో, సాధువులు, సత్పురుషుల ఆశీర్వచన ఫలితమో .. ఈ విధంగా భగవద్గీత యొక్క శుద్ధ ఉచ్చారణ నేర్చుకుంటూ, వివేచన చేసుకోగలుగుతున్నాము. ఈ క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము అత్యంత గుహ్యమైనది; విశిష్టమైనది. దీనిని అర్థం చేసుకోవడానికి కొంత సాధన చేయాల్సి వస్తుంది. భగవద్గీత ని విజ్ఞులు మూడు భాగాలుగా చెప్తారు. మొదటి ఆరు అధ్యాయాలు కర్మయోగాన్ని చెప్తాయి. తరువాతి ఆరు అధ్యాయాలు ఉపాసనా విధానాన్ని బోధిస్తాయి. మిగిలిన ఆరు అధ్యాయాలు జ్ఞానమార్గాన్ని బోధిస్తాయి. అదేవిధంగా వేదాంతులు 'తత్వ మసి' అన్న వాక్యాన్ని భగవద్గీతలో మొదటి ఆరు అధ్యాయాలు 'తత్ 'గురించి చెప్తాయి. మిగిలిన ఆరు అధ్యాయాలు 'త్వమ్' గురించి వివరిస్తాయి. తరువాతి ఆరు అధ్యాయాలు ' అసి' అన్న విషయాన్ని చెప్తాయి.. అంటారు. మనం అన్ని అధ్యాయాలలో అర్జునుడు ప్రశ్న అడిగిన తర్వాత పరమాత్ముడు ఆ విషయాల్ని వివరించడం చూస్తాము. కాని ఈ అధ్యాయంలో భగవంతుడు క్షేత్ర క్షేత్రజ్ఞ జ్ఞానం గురించి తానే వివరించడం మొదలుపెట్టాడు. కొన్ని భగవద్గీత గ్రంథాలలో అర్జునుడు ప్రశ్న అడిగినట్లుగా ఒక శ్లోకం ఉంటుంది. దానివలన భగవద్గీతలో 701 శ్లోకాలు అవుతాయి. ఆదిశంకరాచార్యులు దాన్ని ప్రక్షిప్తంగా భావించారు. స్వామీజీ కూడా అలాగే భావించడం వల్ల మన గీతా పరివార్ వారు ముద్రించిన భగవద్గీత పుస్తకంలో ఈ శ్లోకం లేదు. అదేవిధంగా గోరఖ్ పూర్ వారి గీతా ప్రెస్ భగవద్గీతలో కూడా ఈ శ్లోకం లేదు. ఈ అధ్యాయంలో 5,6 శ్లోకాలలో పరమాత్ముడు క్షేత్రాన్ని గురించి వివరించాడు. ఏడు నుంచి 11వ శ్లోకం దాకా జ్ఞానాన్ని గురించి వివరించాడు. 12 వ శ్లోకం నుండి 17వ శ్లోకం దాకా క్షేత్రజ్ఞుడిని గురించి తెలిపాడు

**13.12**

**జ్ఞేయం(మ్) యత్తత్ప్రవక్ష్యామి, యజ్జ్ఞాత్వామృతమశ్నుతే**

**అనాదిమత్పరం(మ్) బ్రహ్మ, న సత్తన్నాసదుచ్యతే ॥12॥**

అనాదియైన (సనాతనుడైన) పరబ్రహ్మయే తెలిసికొన దగినవాడు. అతనిని తెలిసికొనుటవలన మానవుడు పరమానందమును పొందును. అతడు సదసత్తులకు (సత్ + అసత్ లకు) అతీతుడు. ఆ పరమాత్మనుగూర్చి సమగ్రముగా నీకు తెల్పుచున్నాను.

13.1

క్షేత్రాన్ని గురించి తెలుసుకోవడం సులభం. కాని మనం తెలుసుకోవాల్సింది క్షేత్రజ్ఞుడిని గురించి. అది తెలుసుకున్నప్పుడు మనం అమృతత్వాన్ని పొందుతాము. ఆద్యంతాలు లేని పరబ్రహ్మ స్వరూపమే అది. అటువంటి జేయ స్వరూపాన్ని గురించి చెప్తానని పరమాత్ముడు అంటున్నాడు. అది సత్ కూడా కాదు ; అసత్ కూడా కాదని చెప్పబడుతుంది. ఇక్కడ మనకు కార్య కారణ సిద్ధాంతాన్ని గురించి చెప్పారు. కార్యం మీద దృష్టి ఉన్నప్పుడు అది అసత్ అనబడుతుంది. జ్ఞానులు కారణం మీద దృష్టి పెడతారు. దాన్నే మనం సత్ అంటాము. మనం కేవలం బాహ్య విషయాలనే చూస్తాము. కాని విలువన్నది లోపల ఉన్న దానికే అన్నది గమనించము. ఉదాహరణకి ఒక బంగారు గొలుసు కొనడానికి దుకాణానికి వెళ్ళాం అనుకోండి. మనం గొలుసు అందం ,డిజైన్ మాత్రమే చూస్తాము. కాని దాన్ని అమ్మడానికి వెళ్తే దుకాణదారుడు చూసేది దాని బరువు మాత్రమే! మన ఇంట్లో పాలు ఉన్నాయనుకోండి. ఎవరైనా పెరుగు కావాలని అడిగితే కొద్దిసేపట్లో తోడు పెట్టి ఇవ్వవచ్చు. కాని పెరుగు ఉన్నా దానిని పాలుగా మార్చి ఇవ్వలేము. పాలు కొనాల్సి వస్తుంది. పాలలో పాలు ,పెరుగు రెండు ఉన్నాయి. పెరుగులో పాలు ఉన్నా దాన్ని పాలుగా మార్చలేము. అసత్ ఉన్నచోట సత్ ఉండదు. అజ్ఞానం అంటే జ్ఞానం లేకపోవడం కాదు. మనకు జ్ఞానం లేదన్న సంగతి తెలియకపోవడం! సూర్యుడి నుండి ప్రకాశం వస్తుంది. కాని ప్రకాశం సూర్యుడిలో లేదు. ఆది శంకరాచార్యులు అన్నారు " ఏకోబ్రహ్మద్వితీయం నాస్తి". అంటే బ్రహ్మమొక్కటే వేరొకటి లేదని అర్థం. "మరి బ్రహ్మమొక్కటే అయినప్పుడు మనకు ప్రపంచం ఎన్నో రూపాలుగా ఎందుకు కనిపిస్తుంది" అన్న సందేహం వస్తుంది. దానికి సమాధానం తర్వాతి శ్లోకాలలో పరమాత్ముడు చెప్తున్నాడు.

**13.13**

**సర్వతః(ఫ్) పాణిపాదం(న్) తత్, సర్వతోఽక్షిశిరోముఖమ్**
**సర్వతః(శ్) శ్రుతిమల్లోకే, సర్వమావృత్య తిష్ఠతి ॥13॥**

పరమాత్ముని చేతులు, పాదములు, నేత్రములు, చెవులు, శిరస్సులు, ముఖములు సర్వత్ర స్థితములై యున్నవి. అతడు సర్వమును ఆవరించి యున్నాడు.

13.13

పరమాత్ముడికి అంతటా చేతులు, కాళ్లు, కళ్ళు, తలలూ, చెవులు ఉండి లోకంలో సర్వాన్ని ఆవరించి ఉంటాడు. సర్వానికి కారణమైన పరమాత్ముడు సర్వం లో ఉంటాడు. పనిచేసే చేతులన్నీ ఆయనవే .నడిచే కాళ్లు ,చూసే కళ్ళు, ఆలోచించే తలలూ, తినే నోళ్లు అన్ని ఆయనవే. వ్యక్తమైన అన్ని రూపాలలో, అన్ని ప్రాణులలో తానుగా అంతటా నిలిచి ఉన్నాడు. ఈ విషయాన్ని సంత్ తులసీదాసు గారు తమ రామచరిత మానస్ లో బాలకాండలో ఈ విధంగా అన్నారు.

బినుపద చలయి సునయి బిను కానా।
కరబిను కరమకరయి బిధి నానా।।
ఆనన రహిత సకల రస భోగీ।
బినుబాని బకతా బడ జోగీ।।

కాళ్లు లేకుండా తిరగ గలిగే వాడు, చేతులు లేకుండా ఎన్నో పనులు చేయగలిగిన వాడు, ముఖం లేకుండా అన్ని రసాలని అనుభవించేవాడు, నోరు లేకుండా ఎన్నో విషయాలు మాట్లాడగలవాడు పరమాత్ముడు అని అర్థం. సముద్రంలో పడవలో వెళ్ళేటప్పుడు నత్త గుల్లలన్నీ కలిసి వెళుతూ ఉండడాన్ని చూస్తాం. వాటి మీద సూర్యకాంతి ప్రతిబింబించి అవి వెండిలా మెరుస్తూ ఉంటాయి. అది వెండి కాబోలునని భ్రమ పడతాము.

ఎడారిలో ఎండమావుల వెనక పరిగెడతాము. ఇంద్రధనస్సులో కనిపించే రంగులు నిజమేననుకుంటాము. మనకు తెలుసు " జగం మిథ్య బ్రహ్మ సత్యం " అని. అయినా మనం దాన్ని అర్థం చేసుకోలేము. ఒక భయంకరమైన కల వస్తుంది. కలలో మనల్ని కుక్క తరుముతూ ఉంటుంది. కాని ఆ కల కంటున్నంతసేపు మనం కుక్కని తప్పించుకోవడానికి పరిగెడుతూనే ఉంటాం. నిద్రలో లేచాక మనం నుదుటి మీద స్వేదము ఉంటుంది. కల కంటున్నంతసేపు అది నిజమే అనిపిస్తుంది. అదేవిధంగా ఈ భవసాగరంలోని మాయ కూడా మనకు నిజమే అనిపిస్తుంది

**13.14**

## సర్వేన్ద్రియగుణాభాసం(మ్), సర్వేన్ద్రియవివర్జితమ్
## అసక్తం(మ్) సర్వభృచ్చైవ, నిర్గుణం(ఙ్) గుణభోక్తృ చ ॥14॥

అతడు ఇంద్రియగ్రాహ్యవిషయములను అన్నింటిని ఎఱిగినవాడు. కాని వాస్తవముగా ఇంద్రియాదులకు అతీతుడు. ఆసక్తిరహితుడైనను సమస్తజగత్తును భరించి పోషించువాడు. అతడు నిర్గుణుడయ్యును (గుణాతీతు డయ్యును) ప్రకృతి సంబంధమువలన గుణానుభవములను కలిగియుండువాడు.

13.14
ఆ జ్ఞేయం ఇంద్రియాల లక్షణాల ద్వారా ప్రకాశించేది. కాని దానిలో ఏ ఇంద్రియాలు లేవు. అది దీనిని అంటదు. కాని అన్నిటినీ భరిస్తుంది. గుణ హీనంగా ఉంటూనే, అన్ని గుణాలను భోగిస్తుంది. ఇందులో భగవంతుడి వ్యక్తావ్యక్త స్వరూపాలు, ప్రపంచంతో ఆయనకున్న విచిత్రమైన సంబంధం వర్ణింపబడ్డాయి. జీవులందరికీ ప్రాణమిచ్చి ,జీవితాన్నిచ్చి, జగత్తునిచ్చి భరించేది ఆయనే. కాని ఆయనకి ఎవరి పట్ల ప్రత్యేకమైన సక్త భావం లేదు. అనంతస్థాయిలో ఆయన గుణాతీతుడు. ప్రపంచంలో అన్ని గుణాలను భోగించేది ఆయనే.

**13.15**

## బహిరన్తశ్చ భూతానామ్, అచరం(ఞ్) చరమేవ చ
## సూక్ష్మత్వాత్తదవిజ్ఞేయం(న్), దూరస్థం(ఞ్) చాన్తికే చ తత్ ॥15॥

చరాచరభూతములన్నింటికిని బాహ్యాభ్యంతరముల యందు పరిపూర్ణముగా ఉండువాడును, చరాచర రూపుడును అతడే. అతిసూక్ష్మ (పరమాణు) రూపుడైనందున తెలిసికొనశక్యముకానివాడు, అతిదూరముగను, అతిసమీపముగను స్థితుడై ఉండువాడును అతడే.

13.15
ఈ విశ్వంలో ఉన్న భూతాలకి బయట , లోపల కూడా ఉన్నది జ్ఞేయం. అది కదిలేది కదలనదీ కూడా. సూక్ష్మాతి సూక్ష్మమైనది కనుక దానిని తెలుసుకోవడం కష్టం. అంతటా వ్యాపించి ఉండడం వల్ల అది దూరంగానూ అనిపిస్తుంది. కాని అది లోపల ఆత్మగా అతి దగ్గరగా ఉంది. ఈ శ్లోకంలో పరమాత్ముడు జడత్వం నుంచి చేతనత్వం గురించి చెప్పడాన్ని చూస్తాము. మనం ఈ జడ ప్రకృతి నుంచి చైతన్యాన్ని దర్శించడం చాలా కఠినం. ఇంద్రియాలు, మనసు, బుద్ధి ఇవన్నీ జడమైనవి. వీటి ద్వారా చైతన్య స్వరూపాన్ని మనం తెలుసుకోలేము. అనంతమైన ఆత్మ బుద్ధికి అతీతమైనది. బహిర్ముఖంగా ఎంత వెతికినా కనబడదు. అంతర్ముఖులమైతే అంతటా కనబడుతుంది. జడత్వానికి, చేతనత్వానికి పొందిక కుదరదు. నూనె ,నీళ్లు కలవవు. మనం ఈ బుద్ధితో పరమాత్మ తత్వాన్ని తెలుసుకోలేము. పూజలు , జపాలు తీర్థయాత్రలు ఇలా ఎన్ని చేసినా మనం పరమాత్ముడిని తెలుసుకోలేము. మరి ఏం చేయాలి? సాధన చేసి చేసి ఒక స్థితి వస్తుంది. నేను తెలుసుకున్నవి, చేస్తున్నవి అన్నీ వ్యర్థమే.... అన్న స్థితి. అప్పుడు మనకు పరమాత్మ అనుభూతి కలుగుతుంది. పరమాత్మ దర్శనం కావాలంటే ముఖ్యంగా ఆయన కృప ఉండాలి. మనం చేసే సాధన ఆయన యొక్క కృపకు పాత్రతని కలిగిస్తుంది. పాలలో పెరుగు యొక్క జ్ఞేయ రూపం ఉంటుంది. అందుకే పాలను

తోడు పెడితే పెరుగు అవుతుంది. కాని పెరుగు పాలు కాలేదు. పెరుగు పాలకి అజేయం. ఈ విధంగా మనం జడ ప్రకృతి నుంచి చైతన్యాన్ని తెలుసుకోలేము. సంత్ కబీర్ దాసు గారు అంటారు.

మోకో కహా డూండే రే బందే మై తో తేరే పాస్ మే
నా తీరథ్ మే నా మూరత్ మే నా ఏకాంత్ నివాస్ మే

.............................................................

ఖో జేతో తురంత్ మిల్ జావూ ఏక్ పల్ కీ తాలాశ్ మే
కహే కబీర్ సునో భాయీ సాధూ మై తో హూ విశ్వాస్ మే

ఓ మనిషీ! నీవు నాకోసం ఎక్కడెక్కడో వెతుకుతావు. మందిరాలు, మసీదులు, తీర్థయాత్రలు... ఇలా ఎక్కడెక్కడో తిరుగుతావు. జపాలు ,తపాలు, యోగాలు, వ్రతాలు ఉపవాసాలు ఇలా ఎన్నో చేస్తావు నాకోసం. కాని నేను వాటన్నిటిలోనూ లేను. నీవు వెతికావంటే నేను ఒక్క క్షణం లో కనిపిస్తాను. నీ విశ్వాసంలోనే నేనున్నాను. నీలోనే నేనున్నాను. కస్తూరి మృగం యొక్క నాభిలో కస్తూరి ఉంటుంది. ఆ విషయం దానికి తెలియదు. అది ఈ సువాసన ఎక్కడ నుంచి వస్తుందా అని అడవిలో అంతా వెతుకుతూ ఉంటుంది. మనము కూడా అంతే. అందుకే కబీర్ దాస్ అంటారు

"నేను ఉన్నప్పుడు హరి లేడు. ఇప్పుడు హరి ఉన్నాడు నేను లేను. ప్రేమ మార్గం ఇరుకైనది. ఇద్దరు పట్టరు." నేను అనే అహం తొలగిపోతే మనలో ఉన్న పరమాత్మ దర్శనం కలుగుతుంది. ఒక చిన్న కథ కూడా ఉదాహరణగా చెప్పారు. ఒక ధనవంతుడు రైలులో ప్రయాణం చేస్తూ ఉన్నాడు. అతడు రైల్లో కూర్చొగానే, అతన్ని రైలు ఎక్కించడానికి వచ్చినప్పుడు అతడి కొడుకు డబ్బు విషయం జాగ్రత్త అని జాగ్రత్తలు చెప్పాడు. అది గమనించిన ఒక దొంగ టి. సి. కి వెయ్యి రూపాయలు లంచం ఇచ్చి, ఆ ధనవంతుడి పక్కనే సీటు సంపాదించాడు. అతడితో స్నేహం నటించాడు. రెండు మూడు సార్లు అతడు బయటికి వెళ్లినప్పుడు ఈ దొంగ ధనం కోసం చాలా వెతికాడు. ఆ ధనవంతుడు రాత్రి పడుకున్నప్పుడు, అతడి జేబుల్లో అంతటా వెతికాడు. కాని అతడికి నిరాశే మిగిలింది. పొద్దున్న ఆ ధనవంతుడు మాటల్లో చెప్పాడు. రైలు ఎక్కగానే ఇతడు దొంగ అన్న సంగతి అతడికి తెలిసిపోయిందని. మరి ఎలాగో తెలిసిపోయింది, కనుక డబ్బు ఎక్కడ దాచాడో చెప్పమని.. (ఎలాగూ స్టేషన్ వచ్చేస్తుంది కాబట్టి దొంగ తనం చేయడానికి సాధ్యం కాదు కనుక చెప్పమని ) ధనవంతుణ్ణి దొంగ బతిమాలాడు. నెమ్మదిగా ధనవంతుడు దొంగ యొక్క దిండువరలో దాచిన తన ధనాన్ని బయటకు తీసి తన దగ్గర జాగ్రత్తగా పెట్టుకున్నాడు. మనం కూడా అంతే కదా. మనలోనే ఉన్న పరమాత్మని దర్శించలేము. ఎక్కడెక్కడో వెతుకుతూ ఉంటాము.

**13.16**

## అవిభక్తం(ఇ్) చ భూతేషు, విభక్తమివ చ స్థితమ్
## భూతభర్తృ చ తజ్జ్ఞేయం(జ్), గ్రసిష్ణు ప్రభవిష్ణు చ ॥16॥

పరమాత్మ ఆకాశమువలె విభజించుటకు వీలులేని ఒకేరూపమున పరిపూర్ణుడైయున్నను, సమస్త చరాచరప్రాణుల రూపములలో వేర్వేరుగా గోచరించు చుండును. ఆ పరమాత్మయే సృష్టికర్తయైన బ్రహ్మగా, పోషకుడైన విష్ణువుగా, లయకారకుడైన రుద్రునిగా తెలిసికొనదగినవాడు.

13.16

విభాగం లేకపోయినా పరమాత్ముడు విభక్తుడైనట్టు కనిపిస్తాడు. భూతాలని భరించేవాడు, సృష్టించేవాడు, సంహరించేవాడు, తెలుసుకోదగినవాడు కూడా పరమాత్ముడే. ఇంగ్లీషులో పరమాత్ముడిని GOD అంటారు. G-Generator,O-Operator,D-Destructor. ఒకే పరమాత్మ ఇన్ని పనులను చేస్తూ, ఇన్ని జీవులలో వివిధ రూపాలతో భాసిస్తున్నాడు. ఆకాశం ఉన్నది ఒక్కటే. కాని మనం ఉన్న చోటు నుండి చూస్తే అది విభక్తమైనట్టు కనిపిస్తుంది. ఒక కుండతో నదికి వెళ్లి నదిలో ఆ కుండను ముంచితే, నదిలో ఉన్న నీళ్లు కుండలో కూడా ఉన్నాయి. కాని మనకు వేరుగా కనిపిస్తున్నాయి. ఆ కుండలో నీళ్లు నదిలో కలిపేస్తే తిరిగి నదిగా మారిపోతాయి. ఇదే అవిభక్తంగా ఉన్నది, విభక్తం అయినట్టుగా గోచరించడం

**13.17**

## జ్యోతిషామపి తజ్జ్యోతిః(స్), తమసః(ఫ్) పరముచ్యతే
## జ్ఞానం(ఇఁ) జ్ఞేయం(ఇఁ) జ్ఞానగమ్యం(మ్), హృది సర్వస్య విష్ఠితమ్ ॥17॥

ఆ పరబ్రహ్మ అన్నిజ్యోతులకును జ్యోతి పరంజ్యోతి మాయాతీతుడును, జ్ఞానస్వరూపుడును, తెలిసికొనదగినవాడును తత్త్వజ్ఞానముద్వారా ప్రాప్యుడును అతడే. సర్వప్రాణుల హృదయముల యందు విశేషముగా ఉండువాడును అతడే.

13.17
వెలుగులకంతటికి గొప్ప వెలుగది. చీకటికెంతో దూరమైనది.
( అజ్ఞానానికన్నా పరమైనది). చీకటిని కూడా వెలిగించి చూపుతుంది. కాబట్టి అది తమస్సుకు పరం. అదే జ్ఞానము, జేయము, జ్ఞాన గమ్యము అనే త్రిపుటి. ఇది అందరి హృదయాలలో విశేషంగా నిలిచి ఉంది. కబీర్ దాసు గారు అంటారు
జ్యో తిల్ మాహి తేల్ హై, జ్యో చక్ మక్ మే ఆగ్।
తేరా సాయి తుర్ఝు మే హీ హై, జాగ్ సాకే తో జాగ్।।
నువ్వులలో నూనె ఉంటుంది. అలాగే చెకుముకి రాయిలో అగ్ని ఉంటుంది. అదేవిధంగా పరమాత్ముడు నీలోనే ఉన్నాడు. తెలుసుకోగలిగితే తెలుసుకో. నువ్వుల్లో నూనె ఉంటుంది కాని దాన్ని నేరుగా ఉపయోగించలేము. అదేవిధంగా చెకుముకి రాయిని ప్రయత్నించి రాపాడిస్తే తప్ప అగ్ని పుట్టదు. పరమాత్ముని పొందడానికి మనం సాధన చేయాల్సిన అవసరం ఉంది. లక్నోలో ఒక భూల్ భులయ్యా మహల్ అని ఉంది. ఇందులోకి ప్రవేశించాక తిరిగి వెళ్లాలంటే గైడ్ సహాయం లేకుండా వీలు కాదు. ప్రతి చోటా నాలుగు దారులు ఉంటాయి. ఇందులో ఒక్క దారి మాత్రమే సరైనదిగా ఉంటుంది. అంతేకాక ఆ దారి పై అంతస్తుకు తీసుకు వెళుతుందో, కింది అంతస్తుకు వెళ్తుందో కూడా అర్థం కాదు. అలా తిరుగుతూ ఉండిపోతాం. అలాగే ఈ
భవసాగరాన్ని దాటాలి అన్నా ఒక గురువు అవసరం
ఉంటుంది. మనకు సరైన మార్గదర్శనం చేయడానికి.

**13.18**

## ఇతి క్షేత్రం(న్) తథా జ్ఞానం(ఇఁ), జ్ఞేయం(ఇఁ) చోక్తం(మ్) సమాసతః
## మద్భక్త ఏతద్విజ్ఞాయ, మద్భావాయోపపద్యతే ॥18॥

ఇంతవఱకును క్షేత్రమును గూర్చియు, జ్ఞానమును గూర్చియు, జ్ఞేయమును (తెలిసికొనదగిన పరమాత్మ స్వరూపమును) గుఱించియు సంక్షిప్తముగా వివరించితిని. ఈ తత్త్వమును సమగ్రముగా తెలిసికొనిన నా భక్తుడు నా స్వరూపమునే పొందును.

13.18
పరమాత్ముడు అంటున్నాడు... ఇంతవరకు దర్శింపబడే క్షేత్రాన్ని గురించి, ఆత్మ ని తెలుసుకోవడానికి పనికి వచ్చే జ్ఞానాన్ని గురించి, తెలుసుకోదగినదైన ఆత్మను గురించి వివరించాను. దీనిని అర్థం చేసుకోగలిగిన నా భక్తులు నా తత్వాన్ని ( మోక్షాన్ని) పొందుతారు. భక్తిలో జీవుడి యొక్క అహంకారం కరిగిపోయి ,దైవ భావం బయటపడుతుంది. పరమాత్మన్ని పొందడం ఇలా చూస్తే అలా అయిపోయింది... లేదా ఇలా వింటే అలా అర్థం అయిపోయింది ...అన్నంత సులభం కాదు. విజ్ఞాన శాస్త్ర ప్రకారంగా హైడ్రోజన్ పరమాణువులు, ఆక్సిజన్ పరమాణువులు కలిసి నీరుగా మారుతుందని మనకు తెలుసు. అలాగని మనం నోరు తెరిచి బయట గాలిలో పెడితే మన నోట్లోకి నీరు రాదు. ఈ రెండు పరమాణువులు సంయోగం చెంది నీరుగా మారితేనే నీరు తయారవుతుంది. అదే ప్రకారంగా పరమాత్ముని పొందడానికి నిరంతర సాధన చేయాల్సిన అవసరం ఉంది. దానికి మనకు ఒక గురువు కూడా కావాలి. ఈ సాధన ఫలించినప్పుడు మనకు పరమాత్మ తత్వం అర్థం

అవుతుంది.

**13.19**

**ప్రకృతిం(మ్) పురుషం(ఞ్) చైవ, విద్ధ్యనాదీ ఉభావపి**
**వికారాంశ్చ గుణాంశ్చైవ, విద్ధి ప్రకృతిసమ్భవాన్ ॥19॥**

ప్రకృతి, పురుషుడు - అను ఈ రెండును అనాదియైన (సనాతనమైన) వనియు, రాగద్వేషాది వికారములును, త్రిగుణాత్మకములైన పదార్థము లన్నియును ప్రకృతినుండియే ఉత్పన్నములైనవనియు ఎఱుంగుము.

13.19
ఈ శ్లోకంలో పరమాత్ముడు ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తున్నాడు. ప్రకృతి, పురుషుడు... ఈ రెండూ అనాది నుండి ఉన్నవని తెలుసుకో అంటున్నాడు. ప్రకృతి క్షరమైనది. పురుషుడు అక్షరమైన వాడు. కానీ ప్రకృతిలో ఉన్న ప్రతి వస్తువు లేదా జీవి పూర్తిగా నష్టం కాదు. కేవలం రూపం మారుతుంది అంతే. వ్యక్తం లోంచి అవ్యక్తంలోకి ,అవ్యక్తంలో నుంచి వ్యక్తం లోకి .. ఈ మార్పు నిరంతరంగా సంభవిస్తూ ఉంటుంది. కొంతమంది ఒక ప్రశ్న అడుగుతూ ఉంటారు విత్తు ముందా చెట్టు ముందా అని .ప్రకృతి నిరంతరంగా మార్పులకు గురి అవుతూ ఉంటుంది. ఒక కాగితాన్ని మనం చింపి పడేసాము. కాగితం లేదు కాని ఆ ముక్కలు ఉన్నాయి. ఒకవేళ ఆ ముక్కల్ని కాల్చివేస్తే కాగితం బూడిద గా రూపాంతరం చెందుతుంది.
మోహము, అహంకారము వంటి గుణాలను కూడా సరైన దారిలో మళ్ళిస్తే సదుపయోగమవుతాయి. సత్వరజోతమో
గుణాలు ప్రకృతి నుంచి సంభవించినవి. ఈ రజోగుణాన్ని సరిగ్గా ఉపయోగించుకోవడం వల్ల మన Learn Geeta కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని నేను అనుకుంటున్నాను. మొత్తం 5000 మంది గీతా సేవీలు నిరంతరం ఈ కార్యక్రమం కోసం పనిచేస్తున్నారు. ఇంచుమించు లక్ష మంది సాధకులు ప్రపంచమంతటా రోజూ గీత నేర్చుకుంటున్నారు. ఇదే రజో గుణాన్ని మనం వేరే ఏదో అత్త కోడళ్ళ సీరియల్ చూడడంలో వినియోగిస్తే దానివల్ల ఏ విధమైన లాభమూ ఉండదు. పరమాత్ముడు మనల్ని మనం నియంత్రణలో పెట్టుకోవడానికి సంతోషము, త్యాగము మొదలైన ఎన్నో మంచి గుణాలని ఇచ్చాడు. అహంకారాన్ని అదుపులో పెట్టుకోవడానికి వినయాన్ని ఇచ్చాడు. మోహాన్ని కట్టడి చేయడానికి వైరాగ్యాన్ని ఇచ్చాడు. కోపం వస్తే మన మీద మనకే రావాలి. మనం చేసిన తప్పుల మీద మనకు కోపం రావాలి. అవసరమైతే ఆ తప్పుల కోసం మనల్ని మనమే శిక్షించుకోవాలి. రజోతమో గుణాలను తగ్గించుకుని సత్వ గుణం పెంచుకోవడానికి నిరంతరం పరిశ్రమించాలి. ఒక్కొక్కసారి సత్వగుణం తగ్గించుకోవాలని కూడా మహాపురుషులు చెప్తుంటారు. అలౌకికమైన వారి పనులని సాధారణమైన మన బుద్ధితో అంచనా వేయలేము. స్వామి వివేకానంద గారు , రామకృష్ణ పరమహంస వద్ద శిష్యుడుగా ఉన్నప్పుడు, ఒకొక్కసారి మూడు, నాలుగు రోజులు సమాధి స్థితిలోకి వెళ్లిపోయేవారు. రామకృష్ణ పరమహంస ఆయనని సమాధి స్థితిలో నుంచి బయటకి రప్పించేవాళ్లు. 'నిన్ను విశ్వకళ్యాణం చేయాలని నేను నిర్దేశిస్తున్నాను. ఇలా రోజుల తరబడి ధ్యానంలో ఉండడం నీకు మంచి చేయవచ్చు. కాని నీవల్ల ప్రపంచానికి ఎంతో మేలు జరగాల్సి ఉంది. అందువల్ల నిన్ను నేను ధ్యానం నుంచి బయటికి రప్పిస్తున్నాను' అనేవారు. ఒకసారి ఏసుక్రీస్తు తన 12 మంది శిష్యులతో ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి పర్యటిస్తూ ఉన్నాడు. ఒక గ్రామాన్ని చేరుతూనే ఒక శిష్యుడు మరొక శిష్యుని వైపు చూపిస్తూ 'ఈ గ్రామం ఇతడిదే' అని చెప్పాడు. ఏసుక్రీస్తు అతడిని 'నీకు నీ గ్రామంలో ఉండాలని ఉందా' అని అడిగాడు. అతడు' నాకు ఏమాత్రం అలాంటి కోరిక లేదని' చెప్పాడు. దానికి ఆయన' కొన్ని రోజులు నీవు నీ తల్లిదండ్రులని, బంధువులని కలిసి రా పరవాలేదు' అని అతడికి ఆ గ్రామంలోనే ఉండమని చెప్పాడు. మరొక గ్రామానికి వెళ్ళినప్పుడు ఇంకొక శిష్యుడు ' ఈ గ్రామం నాదే ఇక్కడ కొన్ని రోజులు ఉండమంటారా 'అని అడిగాడు. ఏసుక్రీస్తు అతడితో 'నీవు నా వెంటనే రా ఇక్కడ ఉండవద్దు' అన్నారు. ఆ శిష్యుడికి తనకి అన్యాయం జరిగినట్టుగా అనిపించింది. ఏసుక్రీస్తు ఇద్దరికీ వివరించాడు." అతడికి ఇచ్ఛ అనేదే లేదు. కనుక అతడు వెళ్లినా తిరిగి వస్తాడు. నీకు కోరిక చాలా ఎక్కువగా ఉన్నందున నువ్వు వెళితే తిరిగి రావు. అందువల్ల అలా చెప్పాను". (సత్వగుణం ఎక్కువగా ఉన్న శిష్యున్ని అతడి ఇంటికి పంపాడు.

రజోగుణం ఎక్కువగా ఉన్న శిష్యుడ్ని పంపలేదు.) గురువు పరిస్థితులను అనుసరించి, శిష్యుడి పాత్రతను బట్టి మార్గ నిర్దేశం చేస్తాడని మనం తెలుసుకోవాలి. వివేచనా కార్యక్రమం పూర్తయింది. ప్రశ్నోత్తరాల కార్యక్రమం మొదలయింది.
ప్రశ్న: దుఃఖాన్ని ఎలా తగ్గించుకోవాలి?
జవాబు: సుఖదుఃఖాలన్నవి ఒకటి తర్వాత మరొకటి వస్తూ పోతూ ఉంటాయి. ఇదే జీవిత చక్రం. సుఖం లేదా దుఃఖం అన్నవి వస్తువుల్లో లేవు. మన మనసులో ఉంటాయి. మన మనసు దుఃఖంగా ఉన్నప్పుడు ఎంతో ప్రియమైన వస్తువే అప్రియమవుతుంది. ఇవి మనం చూసే దృష్టి కోణాన్ని బట్టి ఉంటాయి. మనం వాటిని చూసే విధానాన్ని మార్చుకుంటే సాధన తో కొంచెం దుఃఖం తగ్గుతుంది.
ప్రశ్న: అనారోగ్య కారణంగా ఆసుపత్రిలో ఉన్నప్పుడు హనుమాన్ చాలీసా చదవచ్చా?
జవాబు: మనకు శాస్త్రాలలో ఆపద్ధర్మాలని కొన్ని ఇచ్చారు. ఆ ప్రకారంగా ఆసుపత్రిలో ఉన్నప్పుడు కూడా హనుమాన్ చాలీసా చదివితే తప్పులేదు.
ప్రశ్న: మన అహంకారాన్ని ఎలా తగ్గించుకోవాలి?
జవాబు: వినయాన్ని పెంపొందించుకోవడం ద్వారా. ఏది జరిగినా మన పూర్వజన్మ కర్మల వలన జరుగుతుందన్న భావన మనసులో ఉండాలి. ఎవరైనా మనల్ని అవమానపరిచినా దీనివల్ల మన కర్మ ప్రక్షాళన అవుతుందన్న ఆలోచనతో నెమ్మదిగా ఉండగలగాలి. ఈ ప్రకారంగా మనం సాధన చేస్తే వీలవుతుంది.
ప్రశ్న: బ్రహ్మచారికి, విరాగికి, సన్యాసికి భేదం ఏమిటి?
జవాబు: బ్రహ్మచారి జ్ఞానాన్ని అర్జిస్తూ జీవించే వటువు. విరాగి అంటే గృహస్థాశ్రమంలో ఉంటూ కూడా, భోగాల మీద విరక్తితో జీవించేవాడు. సన్యాసి అంటే గురువు వద్ద సన్యాస దీక్ష స్వీకరించి, తన పేరుని, వస్త్రాలని, కుటుంబాన్నీ అన్నిటినీ త్యజించిన వాడు.
ప్రశ్న: జ్ఞానము, జపము, తపమూ, ధ్యానము... వీటి వలన పరమాత్మ దర్శనం కాదు. కాని ఇవేవీ లేకుండా కూడా పరమాత్మ దర్శనం కాదు. ఇవి విరుద్ధ భావాలు కదా!
జవాబు: నిజమే. ఇవి విరుద్ధ భావాలే. జపతపాదులు, ధ్యానము, జ్ఞానము వీటి వలన మన అంతరాత్మ శుద్ధి పొందుతుంది. అప్పుడు మనకు పరమాత్మని దర్శించడానికి పాత్రత కలుగుతుంది. కనుక కేవలం వీటి వలన పరమాత్మ దర్శనం కాదు. కాని ఇవన్నీ మోక్షానికి సోపానాలని మనం అర్థం చేసుకోవాలి.
ప్రశ్నోత్తరాల తర్వాత ప్రార్థన మరియు హనుమాన్ చాలీసా పారాయణంతో కార్యక్రమం ముగిసింది

---



మీకు ఈ అర్థ వివరణ చదివి ఆనందం కలిగింది అని విశ్వసిస్తున్నాము. దిగువ ఇవ్వబడిన లింక్ ద్వారా దయచేసి మీ అమూల్యమైన మూడు నిమిషముల సమయమును వెచ్చించి మీ అభిప్రాయాలను తెలుపగలరు

https://vivechan.learngeeta.com/feedback/

**మీరు వివేచన సారాంశము చదివినందుకు ధన్యవాదములు!**
మీరు వివేచన సారాంశము చదివినందుకు ధన్యవాదములు! గీతా సేవకులు అయిన మేము అందరమూ ఎంతో శ్రద్ధా భావముతో ఈ వివేచన ద్వారా సరియైన భావాన్ని అర్థవంతంగా మీకు అందించాలని ప్రయత్నం చేస్తున్నాము. అయినప్పటికీ భావము, భాషా సంబంధిత తప్పులు ఏమైనా ఉంటే క్షమించమని కోరుతున్నాము.

---

**జై శ్రీకృష్ణ**

సంగ్రాహకులు: గీతా పరివార్ సృజనాత్మక రచనా విభాగం

---

**ప్రతి గృహములో గీత, ప్రతి చేతిలో గీత!!**

రండి, మనమందరం కలిసి ఈ గీతా పరివార్ లక్ష్యం సాదిద్దాము. మనప్రియమైన మిత్రులు, సన్నిహితులు మరియు కుటుంబ సభ్యులందరికి గీతా పరివార్ ఆన్లైన్ తరగతులు అనే బహుమతి ఇద్దాము.

**https://gift.learngeeta.com/**

---

గీతాపరివార్ ఒక నూతన కార్యక్రమమునకు శ్రీకారముచుట్టినది. ఇప్పుడు మనమందరము ఇంతకుపూర్వము జరిగిన సమస్త వివేచన కార్యక్రమముల యూట్యూబ్ వీడియోలను , పీ.డీ.యఫ్. లను క్రింద సూచించిన లింకు ద్వారా చూడవచ్చును.

**https://vivechan.learngeeta.com/**

---

**గీత నేర్చుకోండి గీతా ప్రసారము చేయండి గీతలో నిమగ్నులు కండి**

**।। ఓం శ్రీ కృష్ణార్పణమస్తు ।।**